భారీ వర్షాలతో అతలాకుతలం

- రోడ్లన్నీ జలమయం
- ఇళ్లల్లోకి చేరిన మురుగునీరు
- స్తంభించిన జనజీవనం
- సహాయక చర్యలు నిల్



పోరంకి-నిడమానూరు రోడ్డుపై మురుగునీరు

పెనమలూరు: మండల పరిధిలో శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షంతో గ్రామాల్లో పరిస్థితులు దారుణంగా మారాయి. గ్రామాల్లో ప్రధాన రహదారులన్నీ వర్షం నీటిలో మునిగిపోవడంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. వర్షం నీరు ఇళ్లల్లోకి చేరినా సహాయ చర్యలు ప్రజలకు అందలేదు. పోరంకి-నిడమానూరు రోడ్డు వాన చినుకు పడితే పూర్తిగా మునిగి పోతుంది. గ్రామంలో శనివారం ఉదయం వర్షం నీటితో నిడమానూరు రోడ్డు పూర్తిగా మునిగిపోయింది. రహదారిపై వాహనాలు సైతం కదలలేని పరిస్థితి ఏర్పడింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం పూర్తిగా మునిగిపోయింది. డ్రెయినేజీలపై అపార్టుమెంట్ చప్టాలు ఆక్రమించి ఏర్పాటు చేసిన ఇళ్లు, బడ్డీకొట్లు ఉండటంతో డ్రెయినేజీలో నీటి పారుదల జరగక నిడమానూరు రోడ్డు అంతా జలమయంగా మారింది.

నీట మునిగిన పంట పొలాలు

పోరంకి, కానూరు, వణుకూరు, పెదపులిపాక, తాడిగడప ప్రాంతాల్లో పంట పొలాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. పంట పొలాల వద్ద డ్రెయినేజీల పూడికతీత పనులు చేయకపోవడంతో పొలాల్లో నీరు బయటకు వెళ్లడం లేదు. గత కొద్దిరోజుల వరకు సాగునీటి కొరత ఉండగా ఇప్పుడు వర్షాల కారణంగా పొలాల్లోకి భారీగా నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరల వర్షాలు కురిస్తే పంటలకు పూర్తిగా నష్టం జరుగుతుందని రైతులు తెలుపుతున్నారు. ఇప్పటికే పంటలకు చాలా నష్టం జరిగిందని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వారు కోరుతున్నారు. వరి పంటతో పాటు పసుపు, కంద, ఆకుకూరల పంటలు నీటిలో మునిగిపోయాయి.

తాగునీటి పైప్‌లైన్ ధ్వంసం

పోరంకి-నిడమానూరు రోడ్డు మునిగిపోవడంతో కచ్చా డ్రెయిన్ తవ్వేపనిలో మున్సిపాలిటీ సిబ్బంది మంచినీటి ప్రధాన పైప్‌లైన్‌ను ధ్వంసం చేశారు. జేసీబీతో పైప్‌లైన్‌ను అనాలోచిత చర్యలతో ధ్వంసం చేయడంతో బీజేఆర్ నగర్, మహాలక్ష్మినగర్, పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. తాగునీరు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. కానూరు ప్రధాన రహదారికి డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్డుపై నాలుగడుగుల ఎత్తులో నీరు నిలిచిపోయింది. గ్రామంలో రహదారిపై వెళ్లే కార్లు సైతం మునిగిపోయాయి. కానూరులో సనత్‌నగర్, మురళీనగర్, దళితవాడ, వినాయక్‌నగర్, పలు ప్రాంతాలు వర్షం నీటిలో మునిగి ఉన్నాయి. భారీ వర్షాలతో అన్ని గ్రామాల్లో పరిస్థితులు దారుణంగా మారాయి. గ్రామాల ప్రధాన రహదారులన్నీ మునిగిపోయాయి. పెనమలూరు ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. గ్రామంలో జగనన్న కాలనీ పూర్తిగా వర్షం నీటిలో చిక్కుకుంది. ఇళ్లల్లో నుంచి ఎవ్వరు బయటకు వచ్చే పరిస్థితి లేదు. సహాయ చర్యలు ఎక్కడా కనబడటం లేదు. జనాలు ఏమి చేయాలో తోచక బిక్కుబిక్కుమంటున్నారు.



ముంపునకు గురైన గన్నవరం పోలీస్‌స్టేషన్



చెంచులకాలనీలో ఇళ్లలోకి చేరిన వర్షం నీరు

రామవరప్పాడు: భారీ వర్షానికి రూరల్‌మండలంలోని రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లోని ప్రధాన రహదారులతో పాటు, అంతర్గత రహదారులు నీట మునిగాయి. ఆయా గ్రామాల్లోని పలు అపార్టుమెంట్లు, నివాసాల మధ్యకు వర్షపునీరు చేరింది. రామవరప్పాడు ప్రధాన గ్రామంలో దాదాపు అన్నీ అంతర్గత రహదారులు ముంపునకు గురైయ్యాయి. ప్రసాదంపాడులో రైల్వేకట్ట, కాల్వగట్టు ప్రాంతం, ఎనికేపాడు విజయ ఆగ్రోకట్ట, నిడమానూరులో రామానగర్, కాల్వకట్ట ప్రాంతాల్లో భారీగా వర్షపునీరు చేరుకుంది. భారీగా వర్షపునీరు నిలవడంతో జాతీయ రహదారిపై వాహనాలు బారులు తీరాయి. అంతర్గత రహదారులు, లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి అవ్వడంతో ఆయా గ్రామాల్లోని పంచాయతీ అధికారులు రక్షణ చర్యలు అవలంభించారు. సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లలో అడ్డంకులు తొలగించి వర్షపునీరు బయటకు పోయే విధంగా చర్యలు తీసుకున్నారు.

ఉయ్యూరు: ఎడతెరపి లేకుండా ఈదురుగాలులతో కూడిన వర్షానికి ఉయ్యూరు పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లు ఛిద్రంగా మారాయి. సాయిపురం వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి. గండిగుంట ఎస్సీ కాలనీలో పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. ఇళ్లల్లోకి నీరు ప్రవేశించడంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. వరి పొలాలు, వాణిజ్య పంటలు నీటి ముంపునకు గురయ్యాయి. పెద ఓగిరాల, చిన ఓగిరాల, ఆకునూరు, గండిగుంట గ్రామాల్లో వాణిజ్య పంటలకు నష్టం వాటిల్లింది.

గన్నవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల కుండపోతగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు కాలనీలు, రహదారులు, పంట పొలాలు జలమయమయ్యాయి. మండల పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి వరకు 54.2, శనివారం ఉదయం వరకు 128.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి కేసరపల్లి శివారు వీఎన్. పురం, దుర్గాపురం, చెంచులకాలనీలోని పలు ఇళ్లు, అంతర్గత రహదారులు ముంపు బారినపడ్డాయి. స్థానిక పోలీస్‌స్టేషన్, తహసీల్దారు కార్యాలయంలోకి వర్షం నీరు చేరింది. మర్లవాగు పొంగడంతో దావాజిగూడెంలోని పామర్తినగర్, రమణమ్మచెరువు కాలనీ, రాజీవ్‌నగర్‌లోని ఇళ్లు, రోడ్లు, జెడ్పీ హైస్కూల్ ప్రాంగణం నీట మునిగింది. దావాజిగూడెం రామాలయం వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుపైకి వర్షం నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అల్లాపురం, దావాజిగూడెం, బుద్దవరం, అజ్జంపూడి, కేసరపల్లి పరిధిలో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. ముంపు బారిన పడిన స్థానిక చెంచులకాలనీలో శనివారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పర్యటించారు. జలమయమైన ఇళ్లు, రహదారులను పరిశీలించిన ఆయనకు కాలనీవాసులు సమస్యలను విన్నవించారు. వర్షం నీటిని బయటకు తరలించేందుకు నీళ్ల ఇంజిన్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

నున్న(విజయవాడరూరల్): రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నున్న గ్రామంలో వాగులు పొంగి పొర్లుతున్నాయి. వాగులు పొంగి సమీపంలోని పోలవరం కాల్వలో కలిసాయి. గ్రామాల్లో వర్షం నీరు నిలవకుండా పారుదల అయ్యే విధంగా చర్యలు చేపడుతున్నట్టు ఈఓఆర్డీ ఎంపీడీ ప్రసాద్ తెలిపారు. ప్రజల సౌకర్యార్థం రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ బి.సుగుణ తెలిపారు.

గన్నవరం రూరల్: ఎడతెరపి లేని వర్షాలకు మండలంలోని 21 గ్రామాల్లో 3వేల ఎకరాల వరి పంట పూర్తిగా నీటమునిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేస్తోంది. ముస్తాబాద ఆయకట్టులో వరి నీట మునిగింది. సూరంపల్లి, పురుషోత్తపట్నం గ్రామాల్లో చెరువులు నిండుకుండల్లా మారాయి. పురుషోత్తపట్నం ఊర చెరువు పొంగి పొర్లి బొబ్బర వాగులోకి నీరు ప్రవహిస్తోంది. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముస్తాబాదలో నీటమునిగిన వరి పంట పరిశీలించారు. ముస్తాబాదలో సీపీఎం నాయకుడు కళ్లం వెంకటేశ్వరరావు నీట మునిగిన వరి పంట పరిశీలించారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఉంగుటూరు: మండలంలో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాలు, పంట పొలాలు జలమయ్యమయ్యాయి. ఉంగుటూరు-నందమూరు గ్రామాల మధ్య బుడమేరు మూడు అడుగుట మేర ప్రవహించడంతో అధికారులు రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. పలు గ్రామాల్లో వర్షపునీరు ఇళ్లలోకి వెళ్లాయి.

కంకిపాడు: కంకిపాడు ప్రధాన సెంటరు, బస్టాండు, రైతుబజారు ప్రాంతాలతో పాటుగా ఈడుపుగల్లు, గొడవర్రు జగనన్న లే అవుట్‌లు వర్షం కారణంగా నీట మునిగాయి. డ్రెయిన్లు పొంగి రోడ్డుపైకి మురుగు చేరడంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడ్డారు. భారీ వర్షంతో వరి, అరటి, పసుపు, కూరగాయ తోటల్లో నీరు నిలిచింది. పంట పొలాల ముంపుతో ఆర్థికంగా నష్టం వాటిల్లే ఆస్కారం ఉందని రైతులు వాపోతున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది

పెనమలూరు: కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోంది. పెనమలూరు మండల పరిధిలో యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం గ్రామాల ప్రజలను రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు. దాదాపు 3.5 లక్షల క్యూసెక్కుల వరద నీరు కృష్ణా నదిలోకి ప్రకాశం బ్యారేజీ నుంచి వదలడంతో నది పరవళ్లు తొక్కుతోంది. యనమలకుదురు, చోడవరం, పెదపులిపాక ఘాట్‌ల వద్దకు భారీగా వరద నీరు చేరుకుంది. నదిలో వరద మరింత పెరిగితే నదీ పరివాహక ప్రాంతంలో నిర్మాణాలు చేసుకున్న ఇళ్లల్లోకి నీరు చేరుకునే ప్రమాదం పొంచి ఉంది. రెవెన్యూ అధికారులు పర్యవేక్షిస్తున్నా ఇప్పటివరకు ఎటువంటి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయలేదు.



యనమలకుదురు వద్ద రిటైనింగ్ వాల్‌కు తాకిన వరద నీరు



గండిగుంట ఎస్సీ కాలనీలో ఇళ్ల మధ్య వర్షపునీరు



ఉయ్యూరు మండలం కడవకొల్లు శివారు వీరవల్లిలో నీట మునిగిన వరి పొలాలు



పోరంకిలో నీట మునిగిన వరి చేలు



గోసాల వద్ద వర్షపునీటిలో పసుపు పంట



దావాజిగూడెంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు



రమణమ్మ చెరువు కాలనీ రోడ్డులో వర్షపునీరు



హనుమాన్‌జంక్షన్‌లో ఇళ్లు ముంపునకు గురైన బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ



సింగన్నగూడెంలో పర్యటిస్తున్న గుడివాడ ఆర్డీవో పద్మావతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలో పలు గ్రామాల్లో పంట పొలాలు జలమయం కాగా, లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లు నీట మునిగాయి. స్థానిక మహాత్మగాంధీ నగర్‌లో 50 ఇళ్లు నీట మునిగాయి. ముంపు ప్రాంతాల్లోని నిర్వాసితులకు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు బాధితులను పరామర్శించారు. తరుచూ ముంపునకు గురి అవడానికి కారణాలను తెలుసుకుని శాశ్వతంగా పరిష్కరించాలని రెవిన్యూ, పంచాయతీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. సింగన్నగూడెంలో పర్యటించిన గుడివాడ ఆర్డీవో పద్మావతి ముంపునకు గురైన పంటపొలాలను పరిశీలించారు.



పురుషోత్తపట్నంలో ఓ ఇంట్లోకి చేరిన వర్షం నీరు



పెనమలూరులో నీట మునిగిన కాలనీ



రామవరప్పాడులో నీట మునిగిన అంతర్గత రహదారి



ప్రసాదంపాడు జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు



నున్న వద్ద పొంగిపొర్లుతున్న వాగు

క్లుప్తంగా

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి



పెనమలూరు: విద్యార్థులు పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె. రామమోహన్‌రావు అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ఐటీ ఇండస్ట్రీస్ సమ్మిట్ ఆన్ టాలెంట్ స్కిల్లింగ్ అండ్ హైరింగ్ అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఐటీ రంగంలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా యువత వారి సామర్థ్యాన్ని పెంపొందించుకొని ఉపాధి అవకాశాలు పొందాలని సూచించారు. ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు విద్యార్థులు నిరంతర అభ్యాస ప్రకియలో ఉండాలని అన్నారు. కార్యక్రమంలో కాలేజీ కార్యదర్శి ధనేకుల భవానీప్రసాద్, డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

12 కుటుంబాలకు పునరావాసం



కంకిపాడు: వర్షాలకు తెన్నేరులో వన్నేరు డ్రెయిను పొంగిపొర్లింది. దీంతో గ్రామంలోని వన్నేరు కట్ట వెంబడి ఉన్న 12 నివాసాల్లో నీరు చేరింది. అధికారులు స్పందించి ఆయా నివాసితుల ఇళ్లను ఖాళీ చేయించారు. తెన్నేరు గ్రామంలోని ఎస్సీ హాస్టల్ భవనంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో 12 కుటుంబాలకు ఆవాసం కల్పించారు. వన్నేరు డ్రెయిన్‌ను, పునరావాస కేంద్రంలో కల్పించిన వసతులను ఉయ్యూరు ఆర్డీఓ డి.రాజు పరిశీలించారు. నిర్వాసితులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పర్యటనలో తహసీల్దార్ వి.భావన్నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని 108 సిబ్బంది అంబులెన్స్ వాహనంలో ఒక తల్లికి పురుడు పోసిన సంఘటన శనివారం నున్న గ్రామంలో జరిగింది. గన్నవరం మండలం కట్టుబడిపాలెం గ్రామానికి చెందిన కుమారి అనే మహిళకు పురిటి నొప్పులు వస్తున్నాయని నున్న గ్రామంలోని 108 సిబ్బందికి ఫోను చేశారు. ఆమెను అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తుండగా నున్న గ్రామం వద్ద మహిళ మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం విజయవాడలోని పాత ప్రభుత్వాసుపత్రికి 108 వాహనంలో సురక్షితంగా తరలించారు. కుటుంబసభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పంట పొలాల పరిశీలన



ఉంగుటూరు: మండలంలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురవడంతో నీట మునిగిన పంట పొలాలను మండల వ్యవసాయ శాఖ అధికారి వి.హరీష్ కుమార్ శనివారం పరిశీలించారు. ఆత్కూరు, ఎలుకపాడు, పొణుకుమాడు, ఉంగుటూరు, వెన్నూతల, ఇందుపల్లి గ్రామాల్లో వరి పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. మండలంలో 25,600 ఎకరాల్లో వరిసాగు చేశారని తెలిపారు. ప్రస్తుతం వరి 30-60 రోజుల వయసు కలిగి పిలకలు వేసే దశలో ఉందన్నారు. నీట మునిగిన పొలాల్లో నీటిని ఎప్పటికప్పుడు బయటకు పంపించాలని సూచించారు. ఆదివారం కూడా వర్షం పడే సూచనలు ఉన్నాయని రైతులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఏఈఓ దుర్గా నాగేశ్వరరావు, వీఏఏలు పాల్గొన్నారు.

చెరువులకు గండి

నున్న(విజయవాడరూరల్): కుండపోతగా కురుస్తున్న వర్షాలకు నున్న గ్రామంలో జంగమవాని చెరువుకు శనివారం సాయంత్రం గండి పడింది. గమనించిన రైతులు జేసీబీ మిషన్లతో యుద్ధ ప్రాతిపదికన చెరువు గండిని పూడ్చే పనులు చేపట్టారు. శుక్రవారం రాత్రి నుంచి ఎడతెగక కురుస్తున్న వర్షానికి చెరువులోకి భారీగా వరద నీరు చేరడంతో చెరువుకట్టకు గండిపడింది. అలాగే విలేజి కుందావారి కండ్రికలోని కండ్రిక చెరువుకు గండి పడి చెరువులో నీరంతా పంట పొలాలపై పడి పొర్లుతున్నాయి. సమీపంలోని బురుగుల చెరువుకు వెళ్లవలసిన వాగునీరు కుందావారి కండ్రిక చెరువుకు మళ్లించడంతో నీటి ఉధృతి ఎక్కువై గండి పడిందని రైతులు చెబుతున్నారు. ఆ నీరు వరిపంట పొలాలపై పొర్లుతుండగా తెల్లవారే సరికి రాజీవ్‌నగర్, కండ్రిక ప్రాంతాలు ముంపునకు గురిచేసే అవకాశాలున్నాయి. అధికార యంత్రాంగం గండిని పూడ్చే చర్యలు చేపట్టాలని రైతాంగం విజ్ఞప్తి చేస్తున్నారు.

పాఠశాల సమస్యలను పరిష్కరించాలి

పెనమలూరు: తాడిగడప కార్మికనగర్‌లో ఉన్న మండల పరిషత్ పాఠశాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ప్రజా సంఘాలు, విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ మేరకు వారు వివరాలు తెలుపుతూ కార్మికనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వర్షం చినుకుపడితే చెరువులా మారుతుందన్నారు. ఈ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు పేద చిన్నారులు చదువుతున్నారని అన్నారు. పాఠశాలలో వసతులు లేకపోగా వాన పడితే పాఠశాలలో అడుగు పెట్టే పరిస్థితి లేదని చెప్పారు. గతంలో అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐద్వా, డీవైఎఫ్ఐ యువజన సంఘాల నేతలు పి.లక్ష్మినారాయణ, పుసులూరి పాతాళలక్ష్మి, వీసం సోమశేఖర్, సీహెచ్ భవాని, ప్రకాష్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



తాడిగడప పాఠశాల వద్ద నీటిలో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నేతలు, విద్యార్థులు

డాక్టర్ ఠాగూర్ సేవలు ఎనలేనివి


లబ్బీపేట(విజయవాడతూర్పు): పశు వైద్యుడిగా డాక్టర్ జీఎస్ఆర్ ఠాగూర్ అందించిన సేవలు ఎనలేనివని పలువురు పశు వైద్యులు కొనియాడారు. నగరంలోని ఎన్టీఆర్ సూపర్ స్పెషాలిటీ పశు వైద్యశాల జాయింట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న డాక్టర్ జీఎస్ఆర్ ఠాగూర్ శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. వెట్‌హోమ్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు పశు వైద్యులు మాట్లాడుతూ విధి నిర్వహణలో డాక్టర్ ఠాగూర్ అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



వంతెనల నిర్మాణానికి చర్యలు చేపట్టాలి

గన్నవరం: మండలంలోని పలు గ్రామాల మధ్య ఉన్న వాగులపై వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కేసరపల్లి-ఉప్పులూరు, గూడవల్లి-జక్కులనెక్కలం మధ్య బుడమేరు వాగు పొంగి రాకపోకలు నిలిచిపోయాయని చెప్పారు. కేసరపల్లి-సావరిగూడెం మధ్య ఉన్న వాగుపై లోలెవల్ వంతెన నీట మునిగిందన్నారు. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి వాగులు పొంగడంతో రోజుల తరబడి గ్రామాల మధ్య రాకపోకలు స్తంభిస్తున్నాయని తెలిపారు. అదే విధంగా కుండపోత వర్షాలతో పలు గ్రామాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయని చెప్పారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని కోరినట్లు తెలిపారు.

విరిగిపడ్డ కొండ చరియలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో కొండ చరియలు విరిగి పడ్డాయి. ఈ ప్రమాదంలో 20 మేకలు, గొర్రెలు మృత్యువు వాతపడ్డాయి. అదృష్టవశాత్తు ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా శనివారం ఉదయం ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడ్డాయి. కొండ దిగువున ఉన్న దేవరకొండ వీరభద్రరావు ఇంటిపై పెద్ద పెద్ద కొండరాళ్లు పడటంతో ఇంటి ఆవరణలో ఉన్న మేకలు, గొర్రెలు రాళ్ల కింద ఉండిపోయాయి. దాదాపు 20 జీవాలు మృతువు వాతపడ్డాయని యజమాని వీరభద్రరావు తెలిపారు. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ గోపాలకృష్ణ, సీఐ వెంకటరమణ, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. అయితే అడపాదడపా రాళ్లు కొండపై నుంచి పడుతుండటంతో ఎటువంటి సహాయ చర్యలు చేపట్టలేదు. ఘటనపై రెవెన్యూ అధికారులు రిపోర్టు రాసుకొని వెళ్లారు.

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించడం కనీస బాధ్యతగా గుర్తించాలని ఉమెన్ అండ్ చైల్డ్‌వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ బి.మనోరంజని అన్నారు. శనివారం 'తల్లి పేరుతో ఒక మొక్కను నాటండి'లో భాగంగా విజయవాడ బాలసదనం, ఉద్యోగినుల వసతి గృహంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.